గుజరాత్ గెలుపు బాట

బెంగళూరుకు మూడో ఓటమి

రాణించిన గార్డ్‌నర్

బెంగళూరు: వరుసగా రెండు ఓటముల తర్వాత మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 3వ సీజన్‌లో గుజరాత్ జెయింట్స్ మళ్లీ గెలుపు బాట పట్టింది. గురువారం బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్.. 6 వికెట్ల తేడాతో నెగ్గింది. బంతితో సమిష్టిగా రాణించిన గుజరాత్.. మొదట బ్యాటింగ్ చేసిన ఆర్‌సీబీని నిర్ణీత 20 ఓవర్లలో 125/7 కే కట్టడిచేసింది. కనిక అహుజా (28 బంతుల్లో 33, 1 ఫోర్, 2 సిక్సర్లు) టాప్ స్కోరర్ కాగా రఘ్వి బిస్ట్ (22), జార్జియా వర్హేమ్ (20 నాటౌట్) ఆర్‌సీబీ గౌరవప్రదమైన స్కోరు చేసేందుకు సాయపడ్డారు. గుజరాత్ బౌలర్లలో తనూజా కన్వర్ (2/16), డియాండ్ర డాటిన్ (2/31), కాశ్వీ గౌతమ్ (1/17) ప్రత్యర్థిని కట్టడి చేశారు. ఈ సీజన్‌లో దూకుడుమీదున్న బెంగళూరు స్టార్ బ్యాటర్ ఎలీస్ పెర్రీ డకౌట్ అయింది. డబ్ల్యూపీఎల్‌లో 22 ఇన్నింగ్స్‌లు ఆడిన ఆమెకు డకౌట్ అవడం ఇదే ప్రథమం. జెయింట్స్.. 16.3 ఓవర్ల లోనాలుగు వికెట్లు కోల్పోయి ఛేదనను పూర్తి చేసింది. మూనీ (17), డియోల్ (5) నిరాశపరిచినా ఆ జట్టు సారథి ఆష్లీ గార్డ్‌నర్ (31 బంతుల్లో 58, 6 ఫోర్లు, 3 సిక్సర్లు) మరోసారి కెప్టెన్ ఇన్నింగ్స్‌తో గుజరాత్‌ను విజయపథాన నిలిపింది. లిచ్‌ఫీల్డ్ (30 నాటౌట్) ఆమెకు అండగా నిలిచింది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన బెంగళూరుకు ఆడిన ఐదు మ్యాచ్‌లలో ఇది వరుసగా మూడో ఓటమి.

సెమీస్‌కు వెళ్లేదెవరో?

నేడే ఆస్ట్రేలియా, అఫ్గానిస్థాన్ కీలక పోరు

లాహోర్: నాలుగు రోజుల క్రితం రావల్పిండిలో కురిసిన వర్షం కారణంగా ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మ్యాచ్ రద్దవడంతో సెమీస్ ఆశలను సజీవంగా ఉంచుకున్న అఫ్గానిస్థాన్.. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటుందా? లేదా? అన్నది శుక్రవారం తేలనుంది. లీగ్ దశలో ఇంగ్లండ్‌తో జరిగిన హోరాహోరీ పోరులో బట్లర్ సేనకు షాకిచ్చి ఆ జట్టును ఇంటికి పంపిన అఫ్గాన్.. నేడు ఆస్ట్రేలియాతో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా సెమీస్ బెర్తును ఖాయం చేసుకునే అవకాశమున్న నేపథ్యంలో మ్యాచ్ రసవత్తరంగా సాగడం ఖాయం. 2023 వన్డే ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాను ఓడించినంత పనిచేసిన అఫ్గాన్.. మ్యాక్స్‌వెల్ పోరాటంతో తలవంచక తప్పలేదు. కానీ స్పిన్‌కు అనుకూలిస్తున్న పాక్ పిచ్‌లపై జట్టునిండా స్పిన్నర్లు కలిగిన అఫ్గాన్.. కంగారూలను కంగారెత్తించి నాటి పరాభవానికి బదులు తీర్చుకోవడమే గాక 2024 టీ20 ప్రపంచకప్ తర్వాత వరుసగా రెండోసారి ఐసీసీ టోర్నీ సెమీస్ చేరుకోవాలనే పట్టుదలతో ఉంది. స్టార్క్, కమిన్స్, హెజిల్‌వుడ్ లేని ఆసీస్ బౌలింగ్ విభాగం బలహీనంగా ఉంది. తొలి మ్యాచ్‌లో ఆ జట్టు బౌలర్లు ఇంగ్లండ్‌కు 350కు పైగా పరుగులు సమర్పించుకున్నారు. జద్రాన్, గుర్బాజ్, కెప్టెన్ హష్మతుల్లాతో పాటు ఆల్‌రౌండర్లు గుల్బాదిన్, అజ్మతుల్లా, మహ్మద్ నబీ, రషీద్ స్థాయికి తగ్గ ప్రదర్శన చేస్తే కంగారూలకు కంగారు తప్పకపోవచ్చు. ఇక బౌలింగ్‌లో బలహీనంగా ఉన్నప్పటికీ ఆస్ట్రేలియా బ్యాటింగ్‌లో పటిష్టంగా కనిపిస్తోంది. హెడ్, షార్ట్, స్మిత్, లబూషేన్, ఇంగ్లిస్, క్యారీ, మ్యాక్స్‌వెల్ వంటి ప్రపంచ స్థాయి బ్యాటర్లు ఆ జట్టు సొంతం. లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో మధ్యాహ్నం 2:30 గంటల నుంచి మ్యాచ్ మొదలవుతుంది.

ఫుట్‌బాల్ అకాడమీని పరిశీలించిన ఫిఫా, ఏఐఎఫ్ఎఫ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: నగరంలోని గచ్చిబౌలి స్టేడియంలో ప్రతిపాదిత ఫిఫా ఫుట్‌బాల్ అకాడమీ మౌలిక సదుపాయాలను అంచనావేయడానికి గాను ఫిఫా, అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఎఐఎఫ్ఎఫ్) ప్రతినిధి బృందం శాట్ జి అధికారులతో స్టేడియాన్ని సందర్శించింది. గెడీ రాడీ (ఫిఫా), అనిల్‌కుమార్ (ఎఐఎఫ్ఎఫ్ ప్రధాన కార్యదర్శి), ఐఎఫ్ఎస్, ఎస్ఎటిజివిసి, ఏ. సోనిబాలా దేవి నేతృత్వంలోని బృందం.. స్టేడియంలో క్రీడా సౌకర్యాలు, వసతి, శిక్షణ మైదానాలను క్షుణ్ణంగా తనిఖీ చేసింది.

ఢిల్లీ మెంటార్‌గా పీటర్సన్

ఢిల్లీ: ఐపీఎల్ - 2025 సీజన్‌కు సిద్ధమవుతున్న ఫ్రాంచైజీలు తమ కోచింగ్ సిబ్బంది నియామకాన్ని వేగవంతం చేస్తున్నాయి. తాజాగా ఢిల్లీ క్యాపిటల్స్ రాబోయే సీజన్‌లో తమ జట్టుకు మెంటార్‌గా ఇంగ్లండ్ మాజీ సారథి కెవిన్ పీటర్సన్‌ను నియమించింది.

పాక్ పరువు వర్షార్పణం

టాస్ పడకుండానే పాకిస్థాన్, బంగ్లాదేశ్ మ్యాచ్ రద్దు

రావల్పిండి: మూడు దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత ఐసీసీ టోర్నీ ఆతిథ్య హక్కులను దక్కించుకున్న పాకిస్థాన్.. ఒక్కటంటే ఒక్క మ్యాచ్ కూడా గెలవకుండా ఈ టోర్నీని ముగించింది. లీగ్ దశలో ఆడిన రెండు మ్యాచ్‌లలోనూ ఓడి ఇప్పటికే టోర్నీ నుంచి నిష్క్రమించిన పాకిస్థాన్.. సొంత అభిమానుల ఎదుట కనీసం పరువు నిలుపుకునేందుకైనా ఆడాలని ఆశపడ్డ మ్యాచ్‌పై వరుణుడు నీళ్లుచల్లాడు. రావల్పిండి వేదికగా బంగ్లాదేశ్‌తో గురువారం జరగాల్సిన మ్యాచ్‌లో టాస్ కూడా పడకుండా రద్దయింది. దీంతో ఇరుజట్లకూ తలా ఓ పాయింట్ దక్కినా గ్రూప్-ఏలో పాకిస్థాన్.. నాలుగో స్థానంలో అట్టడుగు స్థానంలో నిలవడం గమనార్హం. బంగ్లాదేశ్ మూడో స్థానంతో సరిపెట్టుకుంది. ఈ గ్రూప్ నుంచి భారత్, న్యూజిలాండ్ ఇదివరకే సెమీస్ బెర్తును ఖాయం చేసుకున్నాయి.

రిజ్వాన్ సేన చెత్త రికార్డు

ఈ టోర్నీలో దారుణ వైఫల్యంతో పాకిస్థాన్ ఓ చెత్త రికార్డును మూటగట్టుకుంది. 23 ఏండ్ల ఈ టోర్నీ చరిత్రలో ఆతిథ్య జట్టు కనీసం ఒక్క మ్యాచ్ కూడా గెలవకుండా నిష్క్రమించడం ఇదే ప్రథమం. 1998లో మొదలై బంగ్లాదేశ్ ఆతిథ్యమిచ్చిన ఈ టోర్నీ (అప్పుడు బంగ్లాదేశ్ ఆడలేదు).. 2000లో నైరోబీలో జరిగింది. రెండో ఎడిషన్‌లో కెన్యా ప్రీక్వార్టర్ ఫైనల్ చేరింది. 2002 నుంచి ఈ టోర్నీ ఆతిథ్యమిస్తున్న జట్లు గ్రూప్ దశలో కనీసం ఒక్క మ్యాచ్

అయినా గెలిచాయి. 2006లో భారత్, 2009లో సౌతాఫ్రికాలో నిర్వహించిన ఈ టోర్నీలో ఆ జట్లు పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిచినా ఒక్క మ్యాచ్‌ను గెలుచుకున్నాయి. ఇక 29 ఏండ్ల తర్వాత పాకిస్థాన్ ఆతిథ్యమిస్తున్న చాంపియన్స్ ట్రోఫీలో పాక్.. సొంతగడ్డపై ఒకే ఒక మ్యాచ్ ఆడగా అందులోనూ ఓడి స్థానిక అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది.

బాక్సర్ స్వీటీ బూరకు వరకట్న వేధింపులు

చండీగఢ్: ప్రముఖ బాక్సర్, మాజీ వరల్డ్ చాంపియన్ స్వీటీ బూర తన భర్త, కబడ్డీ ఆటగాడు దీపక్ హుడాపై వరకట్న వేధింపుల కేసు పెట్టింది. హుడాతో పాటు అత్తింటివారు తనను అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని ఆరోపిస్తూ ఆమె హిసార్‌లోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. భర్త నుంచి తనకు విడాకులు కావాలని ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. 2022లో ఈ ఇద్దరి వివాహం జరిగింది. పెండ్లి సమయంలో కోటి రూపాయల కట్నంతో పాటు ఖరీదైన కారు ఇచ్చినప్పటికీ మరింత కట్నం కోసం వేధిస్తూ భౌతిక దాడులకూ పాల్పడుతున్నారని ఆమె ఫిర్యాదులో ఆరోపించింది.

సెప్టెంబర్‌లో ఆసియా కప్?

ఢిల్లీ: వచ్చే ఏడాది భారత్, శ్రీలంకలో జరుగబోయే టీ20 ప్రపంచకప్‌నకు ముందు సన్నాహకంగా జరుగబోయే ఆసియా కప్ ఈ ఏడాది సెప్టెంబర్‌లో మొదలుకానుంది. ఈ మేరకు ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) ప్రతినిధి ఒకరు స్పందిస్తూ.. 'ఈ టోర్నీ సెప్టెంబర్‌లో జరుగుతుంది. భారత్ వద్ద ఆతిథ్య హక్కులున్నప్పటికీ యూఏఈ లేదా శ్రీలంకలో టోర్నీ జరిగే అవకాశముంది' అని తెలిపాడు. టీ20 ఫార్మాట్‌లో నిర్వహించనున్న ఈ టోర్నీలో భారత్, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్, యూఏఈ, ఓమన్, హాంకాంగ్ తలపడనున్నాయి.

ప్రజ్ఞానంద తొలి గేమ్ డ్రా

ప్రేగ్: చెక్ రిపబ్లిక్ రాజధాని ప్రేగ్ వేదికగా జరుగుతున్న ప్రేగ్ మాస్టర్స్‌లో భారత యువ గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద తన తొలి గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. గురువారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో తెల్లపావులతో బరిలోకి దిగిన అతడు.. చెక్ రిపబ్లిక్‌కే చెందిన డేవిడ్ నవారాతో మ్యాచ్‌ను డ్రాగా ముగించాడు. మరో భారత ఆటగాడు అరవింద్ చిదంబరం.. థాయ్ డే వాన్ (చెక్)తో మ్యాచ్‌లో ఓటమి ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకుని డ్రాతో సరిపెట్టుకున్నాడు.

కేరళ పోరాటం

- తొలి ఇన్నింగ్స్‌లో 131/3

నాగ్‌పూర్: సుదీర్ఘమైన చరిత్ర కలిగిన రంజీ ట్రోఫీ చరిత్రలో తొలిసారి ఫైనల్ ఆడుతున్న కేరళ.. విదర్భతో జరుగుతున్న టైటిల్ పోరులో పోరాడుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో విదర్భను 379 పరుగులకు ఆలౌట్ చేసిన కేరళ.. ఆ తర్వాత బ్యాటింగ్ చేస్తూ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 39 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 131 పరుగులు చేసింది. మొదటి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు ఇంకా 248 పరుగులు వెనుకబడి ఉంది. ఆదిత్య సర్వతె (66 నాటౌట్)తో పాటు కేరళ సారథి సచిన్ బేబీ (7 నాటౌట్) క్రీజులో ఉన్నారు. అహ్మద్ ఇమ్రాన్ (37)తో కలిసి మూడో వికెట్‌కు ఆదిత్య 93 పరుగులు జోడించి కేరళను ఆదుకున్నాడు. అంతకముందు 256/4 వద్ద రెండో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన విదర్భ.. ఓవర్ నైట్ స్కోరుకు మరో 123 పరుగులు జతచేసి ఆలౌట్ అయింది. తొలిరోజు సెంచరీ హీరో డానిష్ (153) మరో 15 పరుగులు జోడించి ఔట్ అవగా లోయరార్డర్ బ్యాటర్లు క్రీజులో

నిలవలేకపోయారు. మూడో రోజు కేరళ.. విదర్భ బౌలర్లను ఏ మేరకు అడ్డుకుంటుందనేదానిపై ఈ మ్యాచ్‌లో ఇరుజట్ల విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి.

మోయినాబాద్‌లోని హైదరాబాద్ పోలో రైడింగ్ క్లబ్‌లో జరుగుతున్న వరల్డ్ ఎలీనా పోలో చాంపియన్‌షిప్-2025లో భాగంగా భారత జట్టు.. 12-4తో ఇంగ్లండ్‌ను ఓడించింది. భారత్ నుంచి చైతన్య కుమార్ (4), అర్సలన్ ఖాన్ (3), సలీమ్ అజ్మి ఐదు గోల్స్ చేశారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.